క్లుప్తంగా

ప్రశ్నించే గొంతుకను గెలిపించాలి

పరకాల : ప్రశ్నించే గొంతుకను పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని ఏఐసీసీ మాజీ సభ్యుడు బక్క జడ్సన్ కోరారు. పరకాల మున్సిపల్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం ఉద్యోగులు, పాలిటెక్నిక్ కాలేజీ అధ్యాపకులను, సర్వశిక్ష అభియాన్ కార్యాలయ ఉద్యోగులను కలిసి ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు ఇచ్చి బలపర్చాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారుడిగా, ప్రజా సమస్యలపై వెంటనే స్పందించే నాయకుడుగా ప్రజాగొంతుక పెద్దల సభలో ఉండాలని అన్నారు. రానున్న ఖమ్మం, వరంగల్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు.

రెండు ఎంపీ స్థానాలు కేటాయించాలి

ధర్మసాగర్ : రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు అన్ని రాజకీయ పార్టీలు రెండు పార్లమెంటు స్థానాలు కేటాయించాలని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ మంగళవారం డిమాండ్ చేశాడు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిగలను విస్మరించడం వలనే అధికారం కోల్పోయిందని ఆరోపించారు. మూడు ఎస్సీ పార్లమెంటు స్థానాల్లో రెండు మాదిగలకు కేటాయించాలని, అధికార, ప్రతిపక్ష పార్టీలు సైతం మాదిగలకు కాకుండా ఇతరులకు టికెట్ కేటాయిస్తే మాదిగలు ఓడించడం ఖాయమని హెచ్చరించారు.

జర్నలిస్టుల చేయూత



పరకాల : మూడు రోజుల క్రితం ఇంట్లో ఎవరూలేని సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ సంభవించడంతో ఇళ్లు దగ్ధమైన బాధిత జర్నలిస్టు నేరెళ్ల పరశురామ్ కుటుంబానికి పరకాల జర్నలిస్టులు చేయూతనిచ్చారు. ఆపదలో ఉన్న తోటి జర్నలిస్టుకు సహాయంగా నిలవాలనే ఆలోచనతో ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల నుంచి సేకరించిన రూ.20వేల నగదును మంగళవారం పరశురామ్‌కు అందించారు. కాగా బాధిత జర్నలిస్టు కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఆయనతో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి సారంగపాణి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను, కౌన్సిలర్లు మడికొండ సంపత్‌కుమార్, సారయ్య, విజేందర్, రఘుపతి ఉన్నారు

బాధిత కుటుంబాలకు పరామర్శ

దామెర : మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన పుల్యాల తిరుపతి, కొనమ్మ ఇటీవల మృతి చెందగా మంగళవారం మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

'సిరికొండ' పరామర్శ



శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన కాళేశ్వరం నర్సయ్య తల్లి ఉప్పలమ్మ, నర్సింహులపల్లికి చెందిన ఉపసర్పంచ్ గోనె నాగరాజు తండ్రి చిన్న కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబాలను మంగళవారం మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పరామర్శించారు. పీఏసీఎస్ డైరెక్టర్ రమేష్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్ పాల్గొన్నారు.

పొదుపుతో ఆర్థిక ప్రగతి

ఆత్మకూరు : ప్రతిఒక్కరూ పొదుపుచేసి ఆర్థిక ప్రగతి సాధించాలని చేయూత పొదుపు సంఘం వ్యవస్థాపకుడు నీల రవీందర్ అన్నారు. హౌజుబుజుర్గులో సంఘం మొదటి వార్షిక సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. పొదుపు చేయడమే కాకుండా అప్పుగా తీసుకున్న డబ్బులను సక్రమంగా చెల్లించి సంఘం అభివృద్ధికి తోడ్పడాలన్నారు. కెనరా బ్యాంకు మేనేజర్ మతీన్‌సిద్దిక్, పంచాయతీకార్యదర్శి అరుణ పాల్గొన్నారు. అంతకుముందు నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నీల రవీందర్, ఉపాధ్యక్షుడిగా సయ్యద్‌వలీ, సభ్యులుగా రాంబాబు, షేక్‌హుస్సేన్, సయ్యద్ మౌలా, షేక్‌అఫ్జల్, రాజు, కుమారస్వామి, మౌలా, నవీన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేడు మంత్రి పొన్నం రాక

కమలాపూర్ : రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ బుధవారం మండలంలో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుండవు చరణ్‌పటేల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని శంభునిపల్లి, కానిపర్తి, దేశరాజుపల్లి, కన్నూరు, మాదన్నపేట గ్రామాల్లో నూతన గ్రామ పంచాయతీ, మహిళా సంఘం భవనాలు ప్రారంభించడంతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

మహాత్మాగాంధీకి ఘన నివాళి

- జాతిపితకు పూలమాల వేసిన పలువురు
- కాంగ్రెస్ పార్టీ, ఆర్యవైశ్య సంఘం నాయకుల నివాళి



నడికూడ : గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కమలాపూర్ : మహాత్మాగాంధీ వర్ధంతిని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆ సంఘం అధ్యక్షుడు కొనిశెట్టి మునీందర్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్రోద్యమంలో గాంధీజీ పాత్ర మహోన్నతమైందన్నారు. శాంతి, అహింసా సిద్ధాంతాలను అనుసరించి మహాత్ముడు దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ ప్రధాన కార్యదర్శులు వెనిశెట్టి పున్నంచందర్, సుద్దాల కార్తీక్, కోశాధికారి నంగునూరి సాగర్ బాబు, నాయకులు వీరభద్రయ్య, విజయ్‌కుమార్, రమేష్, శివశంకర్, రఘురాం, సంపత్, రాజేందర్, శ్రీధరాచారి పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : మహాత్మాగాంధీ వర్ధంతి పురస్కరించుకొని మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద గల గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. సత్యం, అహింసను ఆయుధంగా మలుచుకొని యావత్ భారతావానికి స్వేచ్ఛ స్వాతంత్రాలను ప్రసాదించిన గొప్ప వ్యక్తి గాంధీ అని కొనియాడారు. నాయకులు వైనాల కుమారస్వామి, బాసాని



కమలాపూర్ : గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

మార్కండేయ, చింతల రవిపాల్, కృష్ణమూర్తి, రఫీ, రమేష్, వలిహైదర్, భిక్షపతి, రాజు, చిరంజీవి, సదానందం పాల్గొన్నారు.

నడికూడలో..

నడికూడ : మండల కేంద్రంలో మహాత్మాగాంధీ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు మంగళవారం నిర్వహించారు. ఆపార్టీ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్‌గౌడ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పర్నెం మల్లారెడ్డి, మలహాల్‌రావు, కుమారస్వామి, నీరాటి రాములు, తాళ్ల నవీన్, రాజు, విజేందర్ పాల్గొన్నారు.



శాయంపేట : గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న బుచ్చిరెడ్డి, తదితరులు

మార్కెట్‌ను వినియోగించుకోవాలి



పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ఆత్మకూరు : మండల కేంద్రంలోని జీఎస్ఎం(గొంది నర్సమ్మ-మల్లారెడ్డి మెమోరియల్)ట్రస్టు ఆధ్వర్యంలో ఆత్మకూరు జీపీ పరిధిలో ఏర్పాటు చేసిన డాక్టర్ బూర గోపాలకృష్ణ మెమోరియల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను మంగళవారం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రారంభించారు. అలాగే పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. కూరగాయల వ్యాపారులు మార్కెట్‌ను వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పర్వతగిరి రాజు, ఎంపీపీ మార్క సుమలత, జెడ్పీటీసీ కక్కెర్ల రాధిక, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ చేతన్‌రెడ్డి, కార్యదర్శి మేడ యాదగిరి, బయ్య రాజు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సీఆర్‌పీలు

సీఆర్‌పీల సమస్యలు పరిష్కరించాలి

సీఆర్‌పీలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జి.నరేష్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ.. సీఆర్‌పీలకు మినిమం టైమ్‌స్కేల్ ఇవ్వాలని అన్నారు. స్కూల్ అసిస్టెంట్ బేసిక్‌పే రూ.42వేల300 చెల్లించాలని కోరారు. సీఆర్‌పీకి రవాణా ఖర్చులు, ఫోన్‌బిల్లులు సకాలంలో చెల్లించాలన్నారు. విద్యాశాఖ ఉద్యోగ నోటిఫికేషన్‌లో వెయిటేజీ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు రాజు, రాజేందర్, వంశీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన అవసరం

సంగెం : రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులపై సమాజంలోని ప్రతీఒక్కరికీ అవగాహన అవసరమని ఎంపీపీ కళావతి తెలిపారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా మండలంలోని కుంటపల్లిలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలు విద్యావంతులైతే సమాజంలోని అందరికీ రాజ్యాంగ ఫలాలు సమానంగా అందుతాయని చెప్పారు. కులమతాలకు అతీతంగా ప్రజలు కలిసిమెలిసి జీవించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్, నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, సర్పంచ్ కావటి వెంకటయ్య, పంచాయతీ కార్యదర్శి వాజీద్ హమ్మద్ పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతం

కాజీపేట: మహిళలు, బాలబాలికలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న న్యూ ట్రీషన్ ఫుడ్‌ను సద్వినియోగం చేసుకోవాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సోమిడి సెక్టార్ సూపర్‌వైజర్ డి.కవిత అన్నారు. 62వ డివిజన్ రహమత్‌నగర్ కాలనీలో గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సును నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వి.శ్రీలత, డి.బాలశ్రీ, కె.అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా 'కల్లూరి'

హన్మకొండ : జాతీయ బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కల్లూరి పవన్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ ఆదేశాల మేరకు సంఘం చేపట్టిన కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటున్న హనుమకొండ నయింనగర్‌కు చెందిన కల్లూరి పవన్‌ను యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు ఆయన వివరించారు.

ముగిసిన పుష్పాభిషేకం

కాజీపేట: 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్‌లో కొలువు దీరిన అభయాంజనేయస్వామి దేవాలయంలో ఆది గణపతికి పూలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో భక్తులు సమర్పించిన లక్ష పూలతో గణపతికి సహస్రనామార్చన చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు దేవతామూర్తులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

3న టీజేఎస్ సదస్సు

హన్మకొండ చౌరస్తా: ఫిబ్రవరి 3న హనుమకొండలోని అంబేద్కర్ హాల్‌లో 'విభజన హామీలు- కేంద్ర వివక్ష- దగాపడ్డ ఓరుగల్లు' అంశం పై సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సదస్సుకు ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ కోదండరాం, ఇతర ఉద్యమ నేతలు హాజరవుతారని తెలిపారు. మేధావులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

బీజేపీని విజయతీరాలకు చేర్చాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి

వరంగల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని విజయ తీరాలకు చేర్చేందుకు చేపట్టిన గావ్ చలో... బస్తీచలో అభియాన్ కార్యక్రమంలో ఇంటింటా ప్రచారం నిర్వహించాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన తూర్పు నియోజకవర్గం ఎల్‌బీ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో డాక్టర్ వన్నాల వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గావ్ చాలో..బస్తీ చలో అభియాన్‌లో నాయకులు కార్యకర్తలు, బూత్ కమిటీ, వన్నా ప్రముఖ్‌లతో సమావేశమై కొత్త ఓటర్ల నమోదు, వాట్సాప్ గ్రూపులు, సరళ్ యాప్ డౌన్‌లోడ్, వికసిత్ భారత్ కార్యక్రమాలపై చర్చించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో పర్యటించి పార్టీని బలోపేతం చేయాలన్నారు. సమావేశంలో పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, రత్నం సతీష్‌షా, ఆర్.శ్రీనివాస్, రంజిత్, సాయిరాంనేత, కుమారస్వామి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి

మోదీ పాలనకు చరమగీతం పాడాలి

వరంగల్ చౌరస్తా : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనకు చరమగీతం పాడాలని, ఎన్నికల లబ్ధి కోసం ఫాసిజాన్ని రెచ్చగొడుతూ మళ్లీ అధికారాన్ని చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. మంగళవారం కమ్యూనిస్టు కోఆర్డినేషన్ కమిటీ (సీసీసీ) పిలుపుమేరకు ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో 'ముంచుకొస్తున్న మతోన్మాద మనువాద ముప్పు -లౌకిక శక్తుల పాత్ర' అనే అంశంపై వరంగల్ అండర్ బ్రిడ్జికి సమీపంలోని ఓంకార్ భవన్‌లో సదస్సు జరిగింది. రమేష్ మాట్లాడుతూ గాంధీజీని చంపిన గాడ్సేను దేశభక్తుడిగా చిత్రీకరిస్తూ భారత ప్రజాస్వామ్యాన్ని మోదీ ప్రభుత్వం అపహాస్యం పాలు చేస్తుందని విమర్శించారు. సమావేశంలో ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర ఉపాధ్యక్షులు మంద రవి, ఏఐకేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుంబ బాబూరావు, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర బాధ్యులు నాగెల్లి కొమురయ్య, బీఎల్ఎఫ్ వరంగల్ తూర్పు కన్వీనర్ ఐతం నాగేష్, ఏఐసీటీయూ జిల్లా నాయకుడు మల్లికార్జున్ ,నాయకులు గోవర్దన్ రాజు, ప్రేమలత, అనుష, రేణుక తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న పెద్దారపు రమేష్

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి



పట్టభద్రులకు ఓటరు నమోదు దరఖాస్తులు ఇస్తున్న వాసుదేవరెడ్డి

కేయూ క్యాంపస్: వరంగల్-ఖమ్మం -నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు చేసుకోవాలని తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ మాజీ చైర్మన్ (టీవీసీసీ) కేతిరెడ్డి వాసుదేవరెడ్డి కోరారు. మంగళవారం కాకతీయ యూనివర్సిటీలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఆ విభాగం కేయూ అధ్యక్షుడు భైరపాక ప్రశాంత్ అధ్యక్షతన పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు. క్యాంపస్‌లోని గ్రంథాలయం వద్ద పట్టభద్రులు ఓటరు నమోదు చేసుకోవాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాసుదేవరెడ్డి హాజరయ్యారు. అర్హులైన గ్రాడ్యుయేట్ ఓటర్లకు దరఖాస్తులు అందించి, పలువురు నుంచి దరఖాస్తులను స్వీకరించారు. గత ఎన్నికల సమయంలో 5లక్షల మంది గ్రాడ్యుయేట్లు ఓటరుగా నమోదు చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ జెడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ కొప్పుల సైదిరెడ్డి, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, హసన్‌పర్తి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రజినీకుమార్, సీనియర్ నాయకులు డాక్టర్ వీరేందర్, కొమురయ్య, 17వ డివిజన్ అధ్యక్షుడు దామోదర్, కృష్ణ, విజిలెన్స్ కమిటీ సభ్యుడు రామ్మూర్తి, పాల్గొన్నారు.

పంచాయతీ పాలకవర్గానికి ఆత్మీయ వీడ్కోలు



ఐనవోలు : గ్రామపంచాయతీ సర్పంచ్‌ల, ఉపసర్పంచ్‌ల పదవీ కాలం ఫిబ్రవరి 1తో ముగియనున్న నేపథ్యంలో మంగళవారం హనుమకొండలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మార్నేని మధమతి అధ్యక్షతన ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఆ సందర్భంగా వివిధ శాఖల అధికారులు హాజరై సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, ఎంపీడీఓ వెంకటరమణ, ఎంపీఓ రఘుపతిరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, పంచాయతీకార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వీడి సక్రమంగా విధులు నిర్వర్తించాలి

- అధికారుల తీరుపై కడియం మండిపాటు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వేలేరు : అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మండిపడ్డారు. నిర్లక్ష్యం వీడి సక్రమంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో ఎంపీపీ సమ్మిరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశానికి వచ్చిన అధికారులు ప్రగతి నివేదికను తీసుకురాకపోవడంతో అధికారులను మందలించారు. సాయిపేట నుంచి వేలేరుకు వచ్చే డబుల్‌లైన్ రోడ్డు నిర్మాణ పనులను, వేలేరు మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులకు సకాలంలో సాగునీరు విడుదల చేసే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. మండల పరిధిలో ప్రభుత్వ భూములకు హద్దులను నిర్ణయించి అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సర్పంచ్‌లను సన్మానించారు. జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, జెడ్పీటీసీ సరిత, వైస్ ఎంపీపీ సంపత్, ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ కోమి పాల్గొన్నారు.

వేలేరు : మండలంలోని పీచర గ్రామంలో గల సమ్మక్క సారలమ్మను ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంగళవారం దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని జాతర కమిటీ చైర్మన్ మహేందర్, డైరెక్టర్లను ఆదేశించారు.

నిధులు విడుదల చేయాలి

మండలంలోని పీచర గ్రామంలో గల సమ్మక్క సారాలమ్మ జాతరకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన సీడీఎఫ్ నిధులు కేటాయించాలని మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు మంగళవారం ప్రకటనలో కోరారు. జాతరలో మౌలిక వసతుల కల్పన కోసం, ఇతర అభివృద్ధి పనుల కోసం రూ.10 లక్షల నిధులు కేటాయించాలని కోరారు.

కుష్ఠురహిత సమాజ స్థాపనకు కృషి చేయాలి



ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్ సాయికృష్ణ

శాయంపేట : కుష్ఠురహిత సమాజ స్థాపనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ సాయికృష్ణ అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం గ్రామస్తులకు కుష్ఠువ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాక్టీరియా వలన కుష్ఠువ్యాధి వస్తుందని, వ్యాధి లక్షణాలు బహిర్గతం కావడానికి 3 నుంచి 5 ఏళ్ల కాలం పడుతుందన్నారు. దీనికి లింగ భేదం, వయస్సుతో సంబంధం లేదన్నారు. వంశపారంపర్యంగా సంభవించే వ్యాధి కాదన్నారు. ఈ వ్యాధికి ఎండీటీ చికిత్సతో 6 నెలల నుంచి 12నెలల్లో పూర్తిగా నయం చేసుకోవచ్చన్నారు. చర్మంపై ఏ రకమైన మచ్చలు ఉన్నా సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. కుష్ఠువ్యాధిపై ఉన్న భయాన్ని విడనాడాలని ఆయన సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రవి, పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్, లైన్ఇన్‌స్పెక్టర్ దామోదర్, నాయకులు అశోక్, కుమారస్వామి, బాబు, వైద్య సిబ్బంది వెంకటేశ్వరవర్మ, చలపతి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కమలాపూర్ : మండలంలో అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడిరాజుల రాములు కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ మాధవికి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ భూములను గుర్తించి రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జాలకు పాల్పడకుండా వాటికి హద్దులు నిర్ణయించాలన్నారు. ఉపాధిహామీ పనిని 200 రోజులకు పెంచాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీ పెంచాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ నిరుపేద కుటుంబాలకు 120 గజాల స్థలం మంజూరు చేసి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ప్రభుత్వ భూముల విషయంలో పారదర్శకంగా వ్యవహరించి పేదలకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు దేవరాయి లత, నేరెళ్ల చంద్రమౌళి, సన్నపు సదానందం, పల్లె మోహన్, తిరుపతి, మౌనిక, రమేష్, సుధాకర్, రాజయ్య, భిక్షపతి, వెంకటస్వామి పాల్గొన్నారు.

వర్గీకరణ జరిగేవరకూ నియామకాలు వద్దు



మాట్లాడుతున్న మంద కుమార్

ఐనవోలు : ఎస్సీ వర్గీకరణ జరిగేవరకూ ఎస్సీ, ఎస్టీ, బీసీల ఉద్యోగ నియామకాలు చేపటొద్దని ఎంఎస్పీ జాతీయ అధికార ప్రతినిధి మంద కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్య నాయకుల సమావేశం మండల అధ్యక్షుడు చింత అశోక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్, యూనివర్సిటీ ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ప్రభుత్వం పట్టించుకోకపోతే మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. దళితులకు అంబేడ్కర్ అభయహస్తం వెంటనే అమలు చేసి దళిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మహబూబాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ బిర్రు మహేందర్ మాట్లాడుతూ.. రాష్ట్ర క్యాబినెట్‌లో మరో మంత్రి పదవీ మాదిగలకు ఇవ్వాలని అన్నారు. రానున్న ఎమ్మెల్సీ, రాజ్యసభలో మాదిగలకు సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బండారు సురేందర్, ప్రధాన కార్యదర్శి బొక్కల నారాయణ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుకుమార్, జిల్లా నాయకులు గోలి సుధాకర్, బరిగల వెంకటస్వామి, కట్కూరి రమేష్, చంద్రమౌళి పాల్గొన్నారు.

జీఎంపీఎస్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న చిగుర్ల చేరాలు

ఐనవోలు : గొర్రెలు, మేకలు పెంపకం దారుల సంఘం(జీఎంపీఎస్) జిల్లా కమిటీ ముద్రించిన నూతన క్యాలెండర్‌ను మంగళవారం మండల కేంద్రంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చిగుర్ల చేరాలు ఆవిష్కరించారు. సంఘం బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దయాకర్, ప్రధానకార్యదర్శి చిన్న రాజు, అఖిల భారత యాదవ సంఘం అధ్యక్షుడు రాజు యాదవ్, కల్లు గీత కార్మిక సంఘం నాయకుడు మహేష్‌గౌడ్, మండల కమిటీ సభ్యులు సంగెం శ్రీను, రావుల రవికుమార్, సామాజిక కార్యకర్త రాజారపు రాజ్‌కుమార్, రాజు, పులిగిల్ల కుమారస్వామి, సునీల్, భాస్కర్, సాంబయ్య పాల్గొన్నారు.